క్లుప్తంగా

సన్మానం



బ్రహ్మనందంను సన్మానిస్తున్న నాయకులు

ఇచ్చోడ: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మనందంను గురువారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఇచ్చోడ మండల అధ్యక్షుడు తహరే రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కదం బాబారావు, పేరమండ్ల పోశెట్టి, వినాయక్‌రావు, జాదవ్ రాములు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బోథ్: లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని బోథ్ సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. నంబరు ప్లేటు లేకుండా వాహనాలను నడపవద్దని సూచించారు.

మండల ఏర్పాటుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు

బోథ్: సొనాలను మండలంగా ఏర్పాటు చేయడం పట్ల ఆదివాసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సొనాల మండల కేంద్రంలో మాట్లాడుతూ.. సొనాల మండల ఏర్పాటుతో దూరాభారం తగ్గిందన్నారు. ప్రస్తుతం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయగా, మిగితా మండల కార్యాలయాలను త్వరలోనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

బోథ్: సొనాల మండల కేంద్రంలో సహకార బ్యాంకు ఏర్పాటుకు ఏడీసీసీ బ్యాంకు ఏజీఎం అభయ్ కుమార్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. భవనం నిర్మాణం కోసం రోడ్డుకు 30 ఫీట్లు, రోడ్డు లోపలి వైపు 60 ఫీట్లతో బ్యాంకు కోసం భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, డైరెక్టర్లు గొర్ల రాజు యాదవ్, లోలపు పోశెట్టి, సొనాల మేనేజర్ జాప పోశెట్టి, పాపన్న, సీఈఓ స్వామి, రోహిదాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

బోథ్: బోథ్ మండల తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవ్వ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా సెర్పూర్ శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా రాథోడ్ మనోజ్, సహాధ్యక్షుడిగా ఈర్ల దీపక్, కార్యదర్శులుగా జాదవ్ సకారాం, అశోక్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్, వలభోజు, గోపికృష్ణ, విఠల్ రావ్‌లు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన యువతకు మాజీ ఎంపీటీసీ నారాయణ రెడ్డి రూ.20 వేల విలువ గల క్రీడా సామగ్రిని అందజేశారు. యువత మంచి మార్గంలో నడవాలన్నారు. గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కారెం రవి, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

యూనిట్ల స్థాపన జరిగేనా..?

- 2020–21, 21–22లో 119 యూనిట్లు మంజూరు
- స్థాపించకుండానే నగదు విత్‌డ్రా
- లబ్ధిదారుల గుర్తింపులో అధికారులు



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా శాఖల ద్వారా వివిధ స్వయం ఉపాధి రుణాలను అందజేస్తోంది. అందులో భాగంగానే ప్రభుత్వం ఆదిలాబాద్ రూరల్, మావల మండలంలోని నిరుద్యోగులకు 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ట్రైకార్ పథకం ద్వారా పలువురికి రుణాలు మంజూరు చేసింది. కొంత మంది యూనిట్లను స్థాపించుకోగా మరికొంత మంది యూనిట్లను స్థాపించకుండా ఏటీఎం, బ్యాంకులో నేరుగా నగదు విత్‌డ్రా చేసుకున్నట్లు అధికారుల విచారణలో తెలింది.

119 మందికి..

ప్రభుత్వం 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరంలో ట్రైకార్ పథకం ద్వారా ఆదిలాబాద్ రూరల్ మండలంలో 117 మందికి, మావల మండలంలో ఇద్దరికి రుణాలు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన నగదును ప్రభుత్వం ముందుగానే వారి బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. అయితే ఇందులో కొంత మంది లబ్ధిదారులు యూనిట్‌లను స్థాపించుకోగా మరికొంత యూనిట్లను స్థాపించకుండానే నగదును విత్ డ్రా చేసుకున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. అలాంటి వారిని గుర్తించేందుకు అధికారులు బ్యాంకర్ల వద్దకు వెళ్లి వారిని గుర్తిస్తున్నారు.

నగదు విత్‌డ్రా..

ఆయా మండలాల్లో 19 మంది లబ్ధిదారులు ఎలాంటి యూనిట్లను స్థాపించకుండానే ఏటీఎం ద్వారా నగదును విత్‌డ్రా చేసుకున్నారు. ఇదిలా ఉండగా కొంత మంది లబ్ధిదారులకు సంబంధించిన యూనిట్‌ను ఆన్‌లైన్‌లో లాగింగ్ చేయకపోవడంతో వారు రుణాలను తీసుకోలేదని తెలుస్తోంది. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యూనిట్లు నెలకొల్పాని లబ్ధిదారులను గుర్తించడంతో పాటు ట్రైకర్ నిధులు జమ అయిన్నప్పటికీ బ్యాంకులో పెండింగ్‌లో ఖాతాదారులను గుర్తించి వారు యూనిట్ నెలకొల్పేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

రుణాలు తీసుకున్న వారిని గుర్తిస్తున్నాం



మండలంలో పలువురు లబ్ధిదారులు 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరంలో ట్రైకర్ ద్వారా రుణాలు తీసుకున్నారు. ట్రైకార్ రుణాలు తీసుకున్న వారు యూనిట్లను నెలకొల్పారో లేదో పరిశీలిస్తున్నాం. ఒకవేళ యూనిట్ నెలకొల్పాని వారుంటే బ్యాంకర్లతో మాట్లాడి వారు యూనిట్ ఏర్పాటు చేసుకునేలా చూస్తాం.

– శంకర్, ఎంపీడీవో, మావల

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని కూర గ్రామంలో అలవేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతిఏడాది మాదిరిగానే ఈసారి కూడా వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. స్వామి వారికి గ్రామస్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం స్వామి వారి పల్లకి ఊరేగింపు సేవ, పవళింపు సేవ చేపట్టారు. భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది.

నేడు ఆలయవార్షికోత్సవం

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో శుక్రవారం శబరిమాత ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల తర్వాత, శబరిమాత పల్లకిని ఊరేగించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శిగా అశోక్



కుమ్ర అశోక్

ఆదిలాబాద్‌టౌన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి యూనియన్ (పీడీఎస్‌యూ) రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శిగా కుమ్ర అశోక్ ఎన్నికయ్యారు. ఇటీవల భద్రాచలంలో జరిగిన సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. నిరంతరం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

విద్యార్థుల కోసమే ఆధార్ సెంటర్ ఏర్పాటు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆధార్ అప్‌డెట్ కోసం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రాథోడ్ మానుకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసిన విషయాన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమాచారం ఇచ్చి ఆధార్‌లో చిన్న మార్పులు, చేర్పులకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆధార్ సెంటర్ నిర్వాహకులు దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ లెక్చరర్ జగ్‌రాంకు డాక్టరేట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న లెక్చరర్ జగ్‌రాం అంతర్వేది డాక్టరేట్ పట్టా పొందారు. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ విశ్వ విద్యాలయం నుంచి ఈ డాక్టరేట్‌ను అందుకోవడంతో గురువారం కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లెక్చరర్లు అరుణ్ కుమార్, శ్రావణి, శ్రీధర, జోత్స్న, మంజుల, సంతోష్ కుమార్, రమాకాంత్ గౌడ్, చక్రవర్తి పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్‌లో గల హరిహర ధర్మ క్షేత్ర ఆలయ ప్రతిష్ఠాపన సందర్భంగా ధ్వజస్తంభం ఏర్పాటు కోసం టీచర్స్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడాల రవీందర్ రూ.2.5 లక్షల నగదు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బండి అశోక్‌కు గురువారం ఆలయంలో నగదును అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుడాల రవీందర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు దామోదర గురుస్వామి, కమిటీ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, నరేశ్, లింగన్న, ఆశన్న, బారె శ్రీధర్, పోతన్న, ఊషన్న, శివకుమార్ పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు..

కై లాసనగర్: ఆదిలాబాద్ పట్టణంలోని చాందా(టి)లో గల హజ్రత్ సయ్యద్ సిరాజ్ ఉద్దీన్ రాజన్ షావలీ దర్గా ఉర్సు ఉత్సవాల కోసం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి రూ.51వేల విరాళాన్ని ప్రకటించారు. దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆయన తరపున మైనారిటీ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం దర్గా నిర్వాహకులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు జాకీర్ మౌలానా, రషీద్ అలీ ఖాన్, ఫైజల్లా, కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, జహీర్ రంజాని పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

ఎదులాపురం: తునికాకు సేకరణకు వెంటనే టెండర్లు పిలవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏటా డిసెంబర్, జనవరి నుంచే సేకరణ ప్రక్రియకు సంబంధించిన పనులను అటవీ శాఖ మొదలు పెట్టేదని, ఈ ఏడాది ఫిబ్రవరి మొదటివారం గడుస్తున్నప్పటికీ టెండర్‌లే పిలవలేదని పేర్కొన్నారు. టెండర్, ప్రూనింగ్ ప్రక్రియలను సకాలంలో చేపట్టకుంటే లక్షలాది మంది పేదల ఉపాధికి గండి పడే అవకాశం ఉందని, సత్వరమే నిర్ణయం తీసుకొని పది రోజుల్లో ప్రారంభించాలని పేర్కొన్నారు.

'అశోక్‌కుమార్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలి'



మాట్లాడుతున్న భుజంగ్‌రావు

ఉట్నూర్‌రూరల్: విద్యారంగం అభివృద్ధి చెందాలంటే విద్యారంగానికి చెందిన వారిని, టీచర్ల సమస్యలు తెలిసిన వారిని గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కార్పొరేట్ వ్యయక్తులను, ధనస్వామిక వ్యక్తులను ఓడించి ఎల్లప్పుడు విద్య కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే అశోక్‌కుమార్‌ను గెలిపించుకోవాలిన్సిన అవసరం ఉందన్నారు. అశోక్‌కుమార్‌ను కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవడం టీపీటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, గంగాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

బేల: మండలంలోని పాటన్ గ్రామంలో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.3లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను గురువారం కంపెనీ ప్రతినిధి గిరిష్, మాజీ సర్పంచ్ ఫైజుల్లాఖాన్‌లు ప్రారంభించారు. ఎరువుల విక్రయ కేంద్రాల డీలర్లు శ్రీకాంత్‌రెడ్డి, సుశాంత్‌రెడ్డి, హెచ్‌ఎం మాయకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టి



గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధిహామీ నిధులతో నిర్మించిన నీటి తొట్టీలు వృథాగా మారుతున్నాయి. నీరు లేక దప్పికతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. వేసవికాలం ప్రారంభానికి ముందే వాగులు, చెరువులు నీరు తగ్గుముఖం పడుతుంది. అర్లి (టి) గ్రామంలో వృథాగా మారిన నీటి తొట్టీలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. – తాంసి

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

బోథ్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్) ఇటీవల రెడ్డి కులంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు ఆయనపై మండిపడ్డారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో గురువారం మల్లన్న దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, బస్టాండ్ వద్ద దహనం చేశారు.

కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం

ఖానాపూర్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీకి కట్టుబడి బీసీ కులగణనను పూర్తి చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్ అన్నారు. గురువారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్‌జోన్ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఓరుగల్లు వన్యప్రాణుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర రావు ఆధ్వర్యంలో సభ్యుల బృందం సుగుణను మర్యాద పూర్వకంగా కలిశారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల స్థితిగతులపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. టైగర్‌జోన్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు ఉపాధి కల్పించి ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు.

మాదిగలు సీఎంకు రుణపడి ఉంటారు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: మాదిగలు సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటారని కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి మాదిగలు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సందర్శనకు అవకాశం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

కై లాస్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని సందర్శనకు అకాశం కల్పించాలని భీమ్ ఆర్మీ అధ్యక్షుడు షేక్ షకీల్ అన్నారు. గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ సచివాలయ ప్రాంగణంలో నిర్మించిన అంబేడ్కర్ భారీ విగ్రహ సందర్శనలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. యావత్ దళిత సమాజంతో పాటు మేధా సంపత్తిని అవమానించడమే అవుతుందన్నారు. దళితులు, ముస్లింలు, బహుజన సంఘాలు, ప్రజల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ధావలే రాహుల్, ఎండీ జుబేర్, ఎండీ అయ్యుబ్ పాల్గొన్నారు.

'ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలి'



మాట్లాడుతున్న నాతరి రమేశ్

ఎదులాపురం: ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీగా కృష్ణపెల్లి రాజేశుడుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ధర్మా టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాతరి రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రకుల ప్రజాస్వామ్యవాదుల గొంతుకగా ఎమ్మెల్సీ అభ్యర్థిని బరిలో ఉంచామని, ఆయనను గెలిపించుకోవడం ప్రతీ ప్రజాస్వామ్యవాది బాధ్యత అన్నారు. ధర్మా టీచర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎల్మాల నగేశ్, బొర్రా నగేశ్, అడెల్లు, నారాయణ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) ఆధ్వర్యంలో కన్‌స్ట్రక్షన్ సేఫ్టీ, ఫెసిలిటీస్, మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర ఇన్‌చార్జి ద్యావంత్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల 98665 65156 సంప్రదించాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దును చూపిస్తున్న రైతు

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర శివారులోని పంటచేనులో విద్యుత్ షాక్ గురై ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన మట్ట కిరణ్ యాదవ్ చెందిన ఎద్దు పశుగ్రాసం తినేందుకు చేనులోకి వెళ్లింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలను తినే క్రమంలో ఒకసారిగా విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.90 వేల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు. విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతి రెడ్డి మృతి చెందిన ఎద్దును పరిశీలించారు.

నత్తనడకన రోడ్డు పనులు



తాంసి మండలంలోని పొన్నారి నుంచి బండల్‌నాగాపూర్, వడ్డాడి, గ్రామాలకు అనుసంధానంగా ఐటీడీఏ ద్వారా గత ప్రభుత్వ హయాంలో బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కాని పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు నెమ్మదిగా కొనసాగించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై కంకరవేసి రోలింగ్ చేయకుండా అలాగే వదిలేశారు. – తాంసి